సమావేశంలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మేడి శంకర్, నాయకులు

మాజీ ప్రజా ప్రతినిధుల డిమాండ్లను పరిష్కరించాలి

తెలంగాణ ఎంపీటీసీ, జెడ్పీటీసీ కౌన్సిలర్ల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మేడి శంకర్

చిక్కడపల్లి, నవంబర్ 22: మాజీ ప్రజా ప్రతినిధుల న్యాయమైన డిమాండ్ల సాధనకై జరిగే పోరాటంలో అందరం భాగస్వాములం అవుదామని తెలంగాణ మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ కౌన్సిలర్ల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మేడి శంకర్ పిలుపునిచ్చారు. కవాడిగూడలో తెలంగాణ మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్ల ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేడి శంకర్ మాట్లాడుతూ, గతంలో సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలుగా, జెడ్పీటీసీలుగా, కౌన్సిలర్లుగా ప్రజలకు సేవలందించి మాజీ ప్రజాప్రతినిధులు నేడు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, వారికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. పెన్షన్ ఇవ్వాలని, ఆరోగ్య బీమా అందించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ బొడ్డు దేవయ్య, నాయకులు చంద్రగిరి గోపాల్, యాదయ్య గౌడ్, గంటి మధుసూదన్ రెడ్డి, మహ్మద్, అబ్దుల్ రహీమ్, మల్లికార్జున్ గౌడ్, మల్లేశ్ గౌడ్, రాజు, మల్లారెడ్డి, ఉప్పలయ్య గౌడ్, అప్పారావు, సుంకన్న పాల్గొన్నారు.

డిజిటల్ మీడియా వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగుల జేఏసీ నేతలు

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓపెన్ వర్సిటీ 'డిజిటల్' పోరు

డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఉద్యోగుల జేఏసీ

బంజారాహిల్స్, నవంబర్ 22: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన 10 ఎకరాల స్థలాన్ని జేఎన్ఏఎఫ్ఏయూకి కేటాయించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రెండు నెలలుగా ఉద్యోగులంతా నిరసన కార్యక్రమాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇంత జరుగుతున్నా పట్టించుకోని ప్రభుత్వంపై డిజిటల్ మీడియా ద్వారా కూడా ఆందోళన ఉధృతం చేయాలని జేఏసీ నేతలు నిర్ణయించారు. శుక్రవారం మధ్యాహ్నం యూనివర్సిటీ ప్రాంగణంలో నిరసన కార్యక్రమంలో భాగంగా జేఏసీ చైర్ పర్సన్ ప్రొ. పల్లవీ కాబ్డే, కన్వీనర్ ప్రొ. వడ్డాణం శ్రీనివాస్ తదితరులు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే దాకా ఆందోళన కొనసాగుతుందని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు డిజిటల్ మీడియాను వినియోగించుకోనున్నామని పేర్కొన్నారు.

డా. కేఐ వరప్రసాద్ రెడ్డికి తెలుగు యూనివర్సిటీ విశిష్ట పురస్కారం

వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య రెడ్డి శ్యామల

తెలుగుయూనివర్సిటీ, నవంబర్ 22: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రతి ఏటా సాహిత్యం, లలిత కళలు, సాంస్కృతిక రంగాలకు సేవలందించిన ప్రముఖులలో ఒకరికి విశిష్ట పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరిస్తున్నట్లు వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య రెడ్డి శ్యామల శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది తెలుగు సాంస్కృతిక రంగానికి విశేష సేవలందించిన శాంతా బయోటిక్ వ్యవస్థాపకులు డాక్టర్ కేఐ వరప్రసాద్ రెడ్డికి విశ్వ విద్యాలయం ప్రతిష్ఠాత్మక విశిష్ట పురస్కారాన్ని అందజేయాలని సంఘం ఎంపిక చేసి నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. 284 అన్నమయ్య కీర్తనలను వెలికితీసి ప్రచురించి తెలుగు సంస్కృతిపై విశేషమైన అవగాహన కలిగి సాంస్కృతిక వైభవ వికాసానికి కృషి చేస్తూ ఔత్సాహిక కళాకారులకు, సంస్థలకు, విద్యార్థులకు తన శాంతా వసంతా ట్రస్ట్ ద్వారా ఆర్థిక సేవలందిస్తున్న డాక్టర్ కేఐ వరప్రసాద్ రెడ్డికి ఈ పురస్కారాన్ని అందించడం జరుగుతుందని ఆమె వివరించారు. డిసెంబర్ 2న యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బాచుపల్లిలో నిర్వహించే కార్యక్రమంలో సీఎం చేతుల మీదుగా విశిష్ట పురస్కారాన్ని అందజేసి లక్ష రూపాయల నగదు, ప్రత్యేక జ్ఞాపికను ప్రదానం చేయనున్నట్టు ఆమె తెలిపారు.

డిసెంబర్ 5, 6 తేదీల్లో ఢిల్లీలో బీసీల నిరసన

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్

ఖైరతాబాద్, నవంబర్ 22: బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో డిసెంబర్ 5, 6 తేదీల్లో ఢిల్లీలో రెండు రోజుల నిరసన కార్యక్రమాలను చేపడుతున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ఈ నెల 25 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమవుతున్నాయని, కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. గడిచిన పదేండ్ల కాలంలో బీసీలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ డిసెంబర్ 5న జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా చేపడుతున్నామని, 6న ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో దేశంలోని పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న 26 రాజకీయ పార్టీలతో అఖిల పక్ష సమావేశాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. డీఎస్సీ, గ్రూప్-1, 2, 4లలో ఇలా ప్రతి పరీక్షల్లో మెరిట్ మార్కు సాధించిన బీసీలకు ఉద్యోగాలు రావడం లేదని, కానీ, అగ్రకులాలకు మాత్రం అర్హత లేకున్నా ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. బీసీ బిల్లు పెట్టేంత వరకు కేంద్ర ప్రభుత్వానికి వదిలేది లేదన్నారు. సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్ చారి, కన్వీనర్ బాలరాజు గౌడ్, బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ గౌడ్, గణేశ్ చారి, శ్రీనివాస్ తదితరులు

సమావేశంలో అభివాదరం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, తదితరులు

జన గణనలో కుల గణన చేపట్టాలి

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని 25న బీసీల సమభేరి

ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి

రూ.2 లక్షల కోట్లను కేటాయించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

రవీంద్రభారతి, నవంబర్ 22: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జన గణనలో సమగ్ర బీసీ కుల గణన చేపట్టి పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు పెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కేంద్ర క్యాబినెట్‌లో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్ల నిధులు విడుదల చేయాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నెల 25వ తేదీన రవీంద్రభారతిలో బీసీల సమరభేరి మహాసభ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆర్.కృష్ణయ్య అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, బీసీ నేత నీల వెంకటేశ్‌ల అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. ఈ నెల 25న రవీంద్రభారతిలో జరిగే బీసీల సమరభేరి కార్యక్రమానికి అన్ని పార్టీల నాయకులు హాజరవుతున్నారని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని కులాలకు, సామాజిక వర్గాలకు వారి వారి జనాభా ప్రకారం, రాజకీయ రంగాలలో ప్రాతినిధ్యం కల్పించాలని, కానీ, మన దేశంలో 56 శాతం జనాభా కలిగి ఉన్న బీసీలకు ఇంత వరకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించకుండా అణచివేతకు గురిచేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పీడిత, వివక్షకు గురైన అన్ని వర్గాలకు అన్ని రంగాలలో సమాన వాటా కల్పించకుండా కొంతమంది మాత్రమే రాజకీయ ఫలాలు అనుభవిస్తున్నారని, ఇది ఎంత వరకు సమంజసమని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏండ్లు గడుస్తున్నా చట్టసభల్లో వాటా ఇవ్వకుండా వంచనకు గురి చేస్తున్నారని దుయ్యబట్టారు. దేశాన్ని కాంగ్రెస్ పార్టీ 56 సంవత్సరాలుగా పాలించిందని, కానీ, బీసీలకు తీరని నష్టం చేసిందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలన వచ్చి 11 ఏళ్ళు దాటిపోతున్నా ఇప్పటి వరకు కుల గణన చేపట్టడం లేదని చెప్పారు. మొత్తం 29 రాష్ట్రాలలో 16 రాష్ట్రాలలో ఒక్క బీసీ పార్లమెంట్ సభ్యుడు లేడని, 545 లోక్ సభ సభ్యుల్లో బీసీలు కేవలం 96 మంది మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో 119 ఎమ్మెల్యేలలో బీసీలు 22 మంది మాత్రమే ఉన్నారని, ఆంధ్రప్రదేశ్‌లో 175 ఎమ్మెల్యే సీట్లు ఉంటే కేవలం 40 మంది మాత్రమే ఎమ్మెలు ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో 112 బీసీ కులాలు ఉండగా, 104 కులాలు ఇంతవరకు అసెంబ్లీ గడప తొక్కడంలేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తోడు దొంగలని, బీసీలను ఇంకా ఎన్ని రోజులు వంచనకు గురిచేస్తారని విమర్శించారు. ఈ నెల 26వ తేదీ నుంచి జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ బిల్లు పెట్టాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా బీసీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని డిసెంబర్‌లో ఢిల్లీలో పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళనా కార్యక్రమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే బీసీ విద్యార్థులకు నాణ్యమైన భోజన వసతి, నాణ్యమైన విద్యను అందించాలని, రూ. 4000 కోట్ల స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై లక్షలాది మంది బీసీ విద్యార్థులతో యుద్ధం ప్రకటిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సి.రాజేందర్, అనంతయ్య, నందగోపాల్ పాల్గొన్నారు.

హైడ్రా జీహెచ్‌ఎంసీలో భాగం కాదు

గ్రేటర్‌తో పాటు మరో 27 మున్సిపాలిటీలు మావే..!

డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో ఐఎండీతో కలిసి పనిచేస్తాం..

ఇండియన్ మెటరాలాజికల్ సదస్సులో హైడ్రా కమిషనర్ రంగనాథ్

ఐఎండీ సదస్సులో పాల్గొన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు

సిటీబ్యూరో, నవంబర్ 22(నమస్తే తెలంగాణ): హైడ్రా అనేది ఒక ప్రత్యేక విభాగమని, జీహెచ్‌ఎంసీలో భాగం కాదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. గతంలో ఈవీడీఎం పేరుతో జీహెచ్‌ఎంసీలో ఒక విభాగం ఉండేదని, అప్పుడు ఐఏఎస్, కమిషనర్లు ఉండేవారని, ఇప్పుడు ఒక సెపరేట్ వింగ్‌గా ఏర్పడిందని రంగనాథ్ చెప్పారు. హైడ్రా పరిధిలోకి జీహెచ్‌ఎంసీతో పాటు ఓఆర్ఆర్ లోపల ఉండే మరో 27 మున్సిపాలిటీలు కూడా వస్తాయన్నారు. ఇండియన్ మెట్రాలాజికల్ డిపార్ట్‌మెంట్ 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అమీర్‌పేట్‌లోని సెస్ ఆడిటోరియంలో తెలంగాణలో ఐఎండీ వెదర్, క్లైమేట్ సర్వీసెస్‌పై ఏర్పాటు చేసిన స్టేక్ హోల్డర్స్ ఒకరోజు సదస్సులో రంగనాథ్ పాల్గొన్నారు. ప్రారంభోత్సవ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన అనంతరం, రంగనాథ్ మాట్లాడుతూ ఐఎండీ 1875లో ఏర్పడిందని, హైడ్రా ఈ ఏడాది జూలైలో ఏర్పడిందని, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ఐఎండీతో కలిసి పనిచేస్తామన్నారు. ప్రభుత్వ స్థలాలు, నగరంలోని చెరువులు పరిరక్షించడంతో పాటు ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు ప్రజలను కాపాడేందుకు ప్రభుత్వం హైడ్రాను కొత్తగా ఏర్పాటు చేసిందన్నారు. హైడ్రా దేశంలోనే మొదటిసారి ఏర్పాటైందని, హైడ్రాకు మొదటి కమిషనర్‌గా రావడం తనకు సంతోషంగా ఉందన్నారు. జల వనరులు, ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ ఆస్తులు, చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిని కాపాడటమే హైడ్రా బాధ్యత అన్నారు. హైదరాబాద్ అంటేనే గొలుసుకట్టు చెరువులని, గతంలో ఒక చెరువుకు మరో చెరువుకు కనెక్టివిటీ ఉండేదని, ఇప్పుడా కనెక్టివిటీ దెబ్బతిందన్నారు. తెలంగాణకు సముద్ర తీరం లేకున్నా.. భారీ వర్షాలతో ముంపు పొంచి ఉందని, ఈ నేపథ్యంలో భారతీయ వాతావరణ శాఖ సమాచారం చాలా ముఖ్యమని, సాంకేతికతను అందిపుచ్చుకొని వర్ష సమాచారం ఇవ్వడం ఉపయోగంగా ఉంటుందన్నారు. ఐఎండీ ఏ ప్రాంతంలో ఎంత మొత్తంలో వర్షం పడుతున్నదని, ఎక్కడ వరద ముప్పు ఉంటున్నదో అంచనా వేసి ప్రజలను అప్రమత్తం చేయడం వంటి విధానాలను అందిపుచ్చుకొని ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రకృతి వైపరీత్యాలపై ప్రజలను అప్రమత్తం చేయడంలో ఐఎండీ పాత్ర చాలా కీలకమని, ఐఎండీ పనితీరుతోనే ప్రాణ, ఆస్తి నష్టాలు తగ్గాయని గుర్తు చేశారు. డిజాస్టర్స్‌లో కూడా చాలా మార్పులు వస్తున్నాయని, తెలంగాణలో అర్బనైజేషన్ పెరుగుతున్నదని, 2050 నాటికి 50 శాతం దాటుతుందని చెప్పారు. మెట్రో సిటీస్‌లో వాతావరణ మార్పులు అధికంగా ఉంటున్నాయని, క్లౌడ్ బరస్ట్స్ పెరుగుతున్నాయన్నారు. హైదరాబాద్‌లో నాలాలు, చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని, వర్షం పడినప్పుడు వరద నీరు ఇంకడానికి చాలా సమయం పడుతున్నదని, సాయంత్రం నాలుగైదు గంటలకు వర్షం పడితే భారీగా వరదనీరు వచ్చి చేరుతున్నదన్నారు. వరద నీరు ఇంకడానికి మార్గాలు లేక సిటీలో 150 వాటర్ లాగింగ్స్ ఉన్నాయని చెప్పారు. అర్బన్ డిజాస్టర్ల మీద ఫోకస్ పెట్టాలని, ఇప్పటి వరకు 157 ఏడబ్ల్యూఎస్ స్టేషన్లున్నాయని, ఇంకా కావలసిన అవసరముందన్నారు. ప్రజలు వెదర్ అలర్ట్స్‌ని సీరియస్‌గా తీసుకునేలా హైడ్రా పనిచేస్తుందని రంగనాథ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ మెట్రాలజికల్ సెంటర్ హెడ్ డా.కె.నాగరత్న పాల్గొన్నారు.

నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలు

మాజీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి

విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శన

చిక్కడపల్లి, నవంబర్ 22: నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలని మాజీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. తెలంగాణ బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో బాగ్ లింగంపల్లి సుందరయ్య కళా నిలయంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న 4వ పిల్లల జాతర శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. నగరంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అదే విధంగా సైన్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శనలు అబ్బురపరిచింది. చిత్రలేఖనం, వ్యాసరచన, కథ రచనలుతో వివిధ అంశాల్లో పోటీలను నిర్వహించారు. దీంతో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రాంగణంలో సందడి నెలకొంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ కేవీ రమణాచారి, సినీ గేయ రచయిత అశోక్ తేజ, భారత్ విద్యా సంస్థల సీహెచ్ వేణుగోపాల్ రెడ్డి, ప్రముఖ కవి, రచయిత నందిని సిధారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ పిల్లల క్రమశిక్షణ, వారి ఆలోచన ధోరణి బాగుంటే ఈ సమాజాకి ఎంతో మేలు చేస్తారన్నారు. ఆ దిశగా అందరూ కృషిచేయాల్సిన వవసరం ఉందని చెప్పారు. విద్యా విజయాల కోసం కాదు విలువల కోసం అన్నారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లి దండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. పిల్లల్లో దాగిన అద్భుత అసమాన ప్రతిభ పాటవాలకు వేదికగా నాలుగేండ్లుగా ప్రతిష్ఠాత్మకంగా బాలోత్సవం – పిల్లల జాతర నిర్వహిండచం అభినందనీయమన్నారు. ఆహ్వాన సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ, సీనియర్ సంపాదకులు వినయ్ కుమార్, బాల సాహిత్య, బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యాదర్శి ఎన్.సోమయ్య, కోశాధికారి బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి

భవిష్యత్ రాజకీయాలపై శిక్షణ తరగతులు

సిటీబ్యూరో, నవంబరు 22(నమస్తే తెలంగాణ): భవిష్యత్ భారత రాజకీయాలపై నాలుగు రోజుల పాటు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు పూలే-అంబేద్కర్ సెంటర్ ఫర్ ఫిలాసఫికల్ అండ్ ఇంగ్లిష్ ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ సుదర్శన్ బాలబోయిన శుక్రవారం తెలిపారు. హైదరాబాద్ నగర కేంద్రంలో డిసెంబర్ 5 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే రాజకీయ శిక్షణ తరగతులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి, 20 నుంచి 45 ఏండ్ల మధ్య వయస్సు అన్ని వర్గాల వారు దరఖాస్తులు చేయవచ్చని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 24 వరకు askes2022@gmail.comకు పంపాలని సూచించారు. ఇందుకు కనీస విద్యార్హత డిగ్రీ ఉండాలన్నారు. సామాజిక కార్యకర్తలకు, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ ఆర్గనైజేషన్లలో పనిచేసే వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు ఆయన వెల్లడించారు. కేవలం రూ.150 మాత్రమే చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి నాలుగు రోజుల పాటు ఉచిత భోజనం, వసతి కూడా కల్పిస్తారని వెల్లడించారు.

ఖాజా కుంట ఎస్టీపీ పనులకు జల మండలి ఈడీ పరిశీలన

సిటీబ్యూరో, నవంబర్ 22(నమస్తే తెలంగాణ): ఎస్టీపీల ప్రాజెక్టులో భాగంగా జల మండలి నిర్మిస్తున్న ఖాజా కుంట ఎస్టీపీని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ శుక్రవారం సందర్శించారు. ప్యాకేజ్-3లో నిర్మిస్తున్న ఈ ఎస్టీపీ 20 ఎంఎల్‌డీల సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. నిర్మాణం చివరి దశలో ఉన్న పనులను వేగవంతం చేయాలని ఈడీ పేర్కొన్నారు. ఎస్టీపీ ప్రాంగణంలో అంతర్గత రోడ్లు, లైటింగ్, సుందరీకరణ పనులు చేపట్టాలని సూచించారు. కార్యకలాపాల నిర్వహణకు అడ్మిన్ బిల్డింగ్, స్టాఫ్ క్వార్టర్స్ నిర్మించాలని ఈడీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీపీ సీజీఎం పద్మజ, డీజీఎం, మేనేజర్, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

నృత్యకారిణులతో ప్రముఖ వక్తలు

ఘనంగా వృందావన నృత్యాలయ ద్వితీయ వార్షికోత్సవం

రవీంద్రభారతి, నవంబర్ 22: వృందావన నృత్యాలయ ద్వితీయ వార్షిక వేడుకలను రవీంద్రభారతిలోని మెయిన్ హాల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ నృత్య గురువు బాలాజి, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మలు విచ్చేసి వృందావన నృత్యాలయ నిలయ 2వ వార్షిక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనన్యారెడ్డి ప్రదర్శించిన కూచిపూడి నృత్య రూపకం వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, మన పూర్వీకులు ప్రసాదించిన కూచిపూడి నృత్య కల భావితరాలకు అందించాలని సూచించారు. సభకు ముందు అనన్యారెడ్డి శిష్య బృందంచే ప్రదర్శించిన కూచిపూడి నృత్య రూపకం వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఈ కార్యక్రమంలో పలువురు కూచిపూడి నృత్య గురువులు, నృత్యకారిణులు పాల్గొన్నారు.

గుంటి కృష్ణ కుమార్‌కు ఓయూ డాక్టరేట్

గుంటి కృష్ణ కుమార్‌ను అభినందిస్తున్న ప్రొఫెసర్లు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 22: ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో గుంటి కృష్ణ కుమార్ డాక్టరేట్ సాధించారు. ప్రొఫెసర్ శ్యామ్ సుందర్ పర్యవేక్షణలో ''పబ్లిక్ పర్సెప్షన్స్ ఆన్ పోలీసింగ్ అండ్ లా అండ్ ఆర్డర్ – యాన్ ఎక్స్‌ప్లోరేటరీ స్టడీ ఆన్ రోల్ ఆఫ్ మీడియా ఇన్ హైదరాబాద్'' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి కృష్ణ కుమార్ సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. నల్గొండ జిల్లా కల్లూరు గ్రామానికి చెందిన ఆయన ప్రస్తుతం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో జర్నలిజం అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. తన పరిశోధనా క్రమంలో ఆయన రూపొందించిన పలు పరిశోధనా పత్రాలు వివిధ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

రేపటి నుంచి శ్రీలక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాలు

హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్యచంద్ర గౌరదాస

బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్యచంద్ర గౌరదాస తదితరులు

బంజారాహిల్స్, నవంబర్ 22: బంజారాహిల్స్ రోడ్ నం.12లోని స్వయం భూ శ్రీలక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాలు నవంబర్ 24 నుంచి 29వ తేదీ వరకు కన్నుల పండువగా నిర్వహించనున్నామని హరే కృష్ణ మూవ్‌మెంట్ సత్య చంద్ర గౌరదాస తెలిపారు. ఆలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించిన అనంతరం, సత్యచంద్ర గౌరదాస మాట్లాడారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 24న శ్రీలక్ష్మీనర్సింహ స్వామికి అభిషేకం, విశ్వక్సేన ఆరాధన, అంకురార్పణ, ఈ నెల 25న ధ్వజారోహణ, ఊంజల్ సేవ, నవంబర్ 26న శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి పల్లకీ సేవ, హనుమత్ వాహనం, నవంబర్ 27న శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి కళ్యాణోత్సవం, 28 గరుడ వాహన సేవ, నవంబర్ 29న మహా పూర్ణాహుతి, చక్రస్నానం ఉంటాయని పేర్కొన్నారు. 108 కలశ మహాభిషేకం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఆలయం ఆవరణలో శ్రీరాధా గోవింద మూల విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నామని, 24 నుంచి 28 దాకా శ్రీరాధా గోవింద మూల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కన్నుల పండువగా నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో యజ్ఞేశ్వర దాస తదితరులు పాల్గొన్నారు.

రేపు విశ్వనాథ సాహిత్య పీఠం ద్వి దశాబ్ది ఉత్సవం

పాల్గొననున్న పలువురు సాహితీవేత్తలు

అమీర్‌పేట్, నవంబర్ 22: విశ్వనాథ సాహిత్య పీఠం ద్వి దశాబ్ది ఉత్సవం ఈ నెల 24న అమీర్‌పేట్‌లోని సెస్ ఆడిటోరియంలో జరుగనుంది. ఉదయం 11 గంటలకు జరిగే పుస్తక ప్రదర్శనతో ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆవుల మంజులత, ఆలిండియా రేడియో రిటైర్డ్ ప్రోగ్రామ్ హెడ్ సుమనస్పతిరెడ్డిలు పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి విశ్వనాథ సత్యనారాయణ గారి రచనల్లో 'హాస్యరసం'పై జరిగే సదస్సులో కేంద్ర సాహిత్య అకాడమీ (సలహా బోర్డు) కన్వీనర్ ఆచార్య సి.మృణాళినితో పాటు రిటైర్డ్ ఐఏఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం, విశ్వనాథ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ కొండలరావు వెల్చాలతో పాటు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెల్దండ నిత్యానందరావు, తనికెళ్ల భరణి, ఓలేటి పార్వతీశం తదితరులు పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు మెట్రోరైల్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి చేతుల మీదుగా 'పూర్ణత్వపు పొలిమేరలో..' (సంక్షిప్తం) ఆవిష్కరణ, చేవూరు సుబ్బారావుచే 'సమ్మాన్యుడు' (సంక్షిప్త) ఆవిష్కరణ, ప్రసంగాలు ఉంటాయి. సాయంత్రం 5 గంటలకు రిటైర్డ్ ఐఏఎస్ కేవీ రమణాచారి అధ్యక్షతన 'తెలంగాణతో విశ్వనాథ అనుబంధం'పై కొనసాగే సదస్సులో మంత్రి జూపల్లి కృష్ణారావు, విశ్వనాథ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ కొండలరావు వెల్చాలలు పాల్గొంటుండగా, ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకులు శ్రీనివాస్ కీలకోపన్యాసం చేస్తారు. వీరితో పాటు సీనియర్ జర్నలిస్ట్ కె.రామచంద్రమూర్తి, ఆచార్యులు మాడభూషి శ్రీధర్ సహా పలువురు సాహితీవేత్తలు, కవులు, రచయితలు పాల్గొంటారు.

104లో ఉద్యోగ అవకాశాలు

మేడ్చల్, నవంబరు 22: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ 104 హెల్త్ హెల్ప్‌లైన్ సేవా భాగంలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. 30 ఏళ్లలోపు ఉండి, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీ ఫార్మసీ, డీఎంఎల్‌టీ, ఏఎన్ఎం, జీఎన్ఎం విద్యార్హత ఉన్న వారు ఈ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. షిఫ్టుల వారీగా 8 గంటలు పని చేయాల్సి ఉంటుందన్నారు. 30 ఖాళీలు ఉన్నాయన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నం. 79950 61581లో సంప్రదించాలని ఆయన సూచించారు.

నేరేడ్‌మెట్ అంబేద్కర్ భవన్‌లో మాలల సింహ గర్జన సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, నాగరాజు

మాలల సింహ గర్జన సభను విజయవంతం చేయాలి

మల్కాజిగిరి, నవంబర్ 22: మాలల సింహ గర్జన సభను విజయవంతం చేయాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. నేరేడ్‌మెట్‌లోని అంబేద్కర్ భవన్‌లో డిసెంబర్ 1న సికింద్రాబ్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మాలల సింహ గర్జన సభ పోస్టర్‌ను ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, వర్దన్నపేట్ ఎమ్మెల్యే నాగరాజులు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజు, అంజయ్య, చెన్నయ్య, కృష్ణ, గణేష్, ఉపేందర్, సతీశ్ పాల్గొన్నారు.